క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ డీఈ


కమిషనర్ స్వామిని కలిసిన డీఈ స్వరూపరాణి

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ డీఈగా స్వరూపరాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ మురళీ ఇల్లెందు మున్సిపాలిటీకి బదిలీ కాగా, నిర్మల్ జిల్లా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న స్వరూపరాణి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామిని కలిసి బాధ్యతలు చేపట్టారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


బదిలీ అయిన ఉద్యోగులతో అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది

ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయం, గ్రామపంచాయతీల నుంచి బదిలీపై వెళ్తున్న 18 మంది ఉద్యోగులు, కార్యదర్శులను శుక్రవారం మండల పరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. సుదిమళ్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్యదర్శులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, సూపరింటెండెంట్ ప్రవీణ్, ఏఈ రాజు, ఏపీఓ శంకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆధ్వర్యంలో..
అన్నారం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయురాలు విజయలను శాలువాతో సత్కరించి పూలమాలతో సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు నాగుల్‌స్వామి, కనకదుర్గ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జామే మసీదు కమిటీ ఎన్నిక


ఫయాజ్ ఉల్ హుస్సేన్


ఇబ్రహీం ఖురేషి

పాల్వంచ: పట్టణంలోని నటరాజ్ సెంటర్ జామే మసీద్‌లో శుక్రవారం మసీద్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎండీ ఫయాజ్ ఉల్ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి ఇబ్రహీం ఖురేషి, మాజీద్ ఖురేషి, గౌస్ పాషాలు పోటీ పడగా మూజువాణి పద్ధతిలో ఇబ్రహీం ఖురేషి ఎన్నికయ్యారు. గతంలో ఉన్న పాత కమిటీని రద్దు చేసి, ఖాజా అహ్మద్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీని నియమించారు. ఈనెల 12న జామే మసీద్ పరిధిలో ఉన్న రెండు మసీద్‌లతో పాటు జామే మసీద్‌కు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. అధ్యక్షుడిగా ఎండీ ఫయాజ్ ఉల్ హుస్సేన్ దరఖాస్తు మాత్రమే రావడంతో ఏకగ్రీవం అయ్యారు. త్వరలోనే పూర్తి కమిటీని నియమిస్తామని కమిటీ పెద్దలు ప్రకటించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న కమిషనర్ శేషాంజన్ స్వామి

కొత్తగూడెంఅర్బన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళా శక్తి కార్యక్రమంపై శుక్రవారం మున్సిపల్‌లో అవగహన కల్పించారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి క్యాంటీన్లు-4, మీ-సేవా యూనిట్లు-4, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు-9 మంజూరయ్యాయని, వీటిని మహిళా సమాఖ్యలకు కేటాయించడం జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా ఏడీఎంసీ చంద్రశేఖర్‌బాబు, మెప్మా టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, సీఓలు శాంతకుమార్, మౌలాలి, సరిత, సమాఖ్య ఆర్పీలు పాల్గొన్నారు.

రికార్డింగ్ స్టూడియో ప్రారంభం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలోని కల్యాణ్ సుమిత్రా రికార్డింగ్ స్టూడియో, యూట్యూబ్ చానల్‌ను శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్, కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ ప్రారంభించారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తి

- ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్
- మండలంలో 11,886 ఇళ్ల వివరాలు నమోదు


ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది

చుంచుపల్లి: ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ లక్ష్యం ఎంత మేరకు నెరవేరింది. ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా.. లేదా..? అని తేల్చేందుకు సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేపట్టారు. ఇంటింటికీ భగీరథ కనెక్షన్ ఉందా.. లేదా.. అని ఆరా తీసి ఆధార్, ఫోన్ నంబర్ వివరాలు, ఫొటోలు తీసుకుని ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకున్నారు. మండలంలో ఈ ప్రక్రియ దాదాపు నెల రోజులుగా కొనసాగుతోంది. మిషన్ భగీరథ కనెక్షన్ లేని కొత్త కాలనీలు, ఇళ్లను సర్వే ద్వారా పంచాయతీ అధికారులు గుర్తించారు. చుంచుపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీలైన విద్యానగర్, 3 ఇంక్‌లైన్, 4 ఇంక్‌లైన్, బాదావత్ తండా, చుంచుపల్లితండా, నందాతండా, రుద్రంపూర్, గౌతంపూర్, వెంకటేష్‌ఖని, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పెనుబల్లి, పెనగడప, రాంపురం, అంబేడ్కర్ నగర్, బాబూక్యాంపు, ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీల్లో ఈ మిషన్ భగీరథ కుళాయిల పరిశీలన సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. మండలంలో మొత్తం 11,886 నివాస గృహాలు ఉండగా అందులో 10,790 ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు గుర్తించారు. మరో 1,096 ఇళ్లకు నల్లాలు లేవని తేలింది. సర్వేలో గుర్తించిన భగీరథ కనెక్షన్ లేని కుటుంబాలన్నింటికీ త్వరలో కొత్త కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి పథకం ద్వారా నిధులు సమీకరించి ఆయా ఇళ్లకు నూతనంగా నల్లా కనెక్షన్ల సౌకర్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నహాలు చేస్తోంది. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు చాలాచోట్ల దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఇంటికి ఒక నల్లా కనెక్షన్ మాత్రమే ఉండాలి. పలుకుబడి ఉపయోగించుకుని, గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో కొందరు తమ ఇళ్లకు రెండు, మూడు నల్లా కనెకన్లు కూడా తీసుకున్నారు. వాటిని సిబ్బంది సర్వేలో గుర్తించారు. ఆయా నల్లాలను తొలగిస్తారా, ఉంచుతారా అనేది తేలాల్సి ఉంది. బగీరథ ద్వారా సరఫరా జరుగుతున్న కనెక్షన్లు, స్థానిక వనరుల ద్వారా ఎన్ని కుళాయిలు నడుస్తున్నాయనేది కూడా ఈ సర్వేలో తేలింది.


నల్లా నీళ్లు పడుతున్న మహిళ

సర్వే ముగిసింది...



మిషన్ భగీరథ తాగునీటి నల్లాల కనెక్షన్లపై ఇంటింటి సర్వే ఇటీవల మండల వ్యాప్తంగా ముగిసింది. గ్రామాల పరిధిలో కనెక్షన్ల పూర్తి గణాంకాలను ఇంటింటికీ వెళ్లి పంచాయతీ సిబ్బంది సేకరించారు. ఇంటి యజమాని సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఈ సర్వేను పరిగణలోకి తీసుకొని తాగునీటి వసతి లేని కుటుంబాలకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించే అవకాశముంది. – **గుంటి సత్యనారాయణ, ఎంపీఓ**

అటవీ భూమిని స్వాధీనం చేసుకుంటాం..


మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ వెంకన్న

ఇల్లెందు: ఇల్లెందు ఎఫ్‌డీఓ పరిధిలోని పూసపల్లి అటవీ ప్రాంతంలో కొంతమంది గిరిజనేతరులు పోడు భూమిని ఓ గిరిజన రైతుకు విక్రయించిన విషయమై సర్వే చేసి త్వరలోనే ఆ భూమిని స్వాధీనం చేసుకుంటామని ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న అన్నారు. శుక్రవారం పూసపల్లి పోడు భూముల్లో సాగు విషయంపై ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించారు. మాట్లాడుతూ.. కొంతమంది అడివిని నరికి సాగుచేశారని, వారికి పట్టాలు వచ్చే అవకాశం లేదని తెలుసుకుని ఓ ఆసామికి అమ్మినట్లు తెలిసిందన్నారు.

ఈ విషయమై ఇప్పటికే అక్కడి బీట్ ఆఫీసర్‌కు నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. అటవీ పరిధిలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతామని పేర్కొన్నారు. ఈ విషయమై డీఎఫ్ఓ కృష్ణగౌడ్ నుంచి కూడా భూమి స్వాధీనం కోసం ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. ఇందులో అటవీశాఖకు ఎలాంటి సంబంధం లేదని, పోడు పట్టాలు అటవీశాఖ ఒక్కటే ఇచ్చేది కాదన్నారు. రెవెన్యూ, ఎంపీడీఓ, గ్రామ కమిటీలు ఉంటాయని తెలిపారు.

డివిజన్ పరిధిలో భారీగా బదిలీలు..
ఇల్లెందు డివిజన్ పరిధిలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నట్లు ఎఫ్‌డీఓ వెంకన్న తెలిపారు. 30 మంది బీట్ ఆఫీసర్లు, ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లు, ఒక డీఆర్ఓ, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక సూపరింటెండెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ బదిలీ అయినట్లు తెలిపారు. గుండాలకు నర్సింహారావు, కాచనపల్లికి చలపతిరావు ఎఫ్ఆర్ఓలు బదిలీపై వచ్చారని, కొమరారం ఖాళీగా ఉందన్నారు.

లక్ష మొక్కలు నాటేందుకు..
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో డివిజన్‌లో లక్ష మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పాల్వంచ: ఈనెల 27న జరగాల్సిన పాల్వంచ మండల పరిషత్ సర్వభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని, జిల్లా, మండల ప్రాదేశిక సభ్యులు, గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రుణమాఫీపై డీఏఓ ఆరా..

సుజాతనగర్: శుక్రవారం సర్వారంలో ఇటీవల రుణమాఫీ పొందిన రైతుల ఇంటింటికీ వెళ్లి జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు మాట్లాడారు. రుణం పొందిన వారు మళ్లీ తిరిగి అప్పు తీసుకోవచ్చని సూచించారు. ఏఓ సాయి నారాయణ, ఎంపీఓ నర్మద, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రనూష పాల్గొన్నారు.

రక్తదానం

ఇల్లెందు: కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతం నుంచి తరలివచ్చిన 100 మంది యువకులు రక్తదానం చేశారు.

మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: గోలియా తండా పంచాయతీ వాగొడ్డు తండా అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఈ కేంద్రంలోకి వెళ్లాలంటే బురద, మురుగు నిల్వను దాటి వెళ్లాల్సి వస్తోంది. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిలో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఈనెల 23న సాక్షిలో 'మురుగులోనే అంగన్‌వాడీ నిర్వహణ'అనే శీర్షికతో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న మురుగును తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

వృత్తి నైపుణ్య శిక్షణ

ఇల్లెందురూరల్: పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా జిల్లాలోని 36 మంది తాపీ పనివారికి వృత్తినైపుణ్య శిక్షణ శిబిరాన్ని మండలంలోని వైటీసీలో శుక్రవారం నిర్వహించారు. న్యాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో శిక్షకుడు రవీందర్ తాపీ పనిలో మెళకువలపై అవగాహన కల్పించారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని మానవ అక్రమ నివారణ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామవరం సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో సైబర్ నేరాలపై అవగహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సులభంగా డబ్బు సంపాదించడానికి మానవ అక్రమ రవాణా సాధనంగా మారిందని అలాంటి మాయగాళ్ల ఉచ్చులో పడరాదని హెచ్చరించారు. అబ్బాయిలకు గంజాయిలాంటి మత్తు మందులకు అలవాటు చేసి వారితో నేరాలు చేయిస్తున్నారని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డైల్ చేసి పోలీసుల సహాయం పొందాలని కోరారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయండి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం డీఈఓ వెంకటేశ్వరచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ... చలో హైదరాబాద్ 31న స్కూల్ బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన రూ.పదివేల వేతనం, వంట సామగ్రి, కోడిగుడ్లు, వంటగ్యాస్, రాగిజావపై పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రభావతి, రమాదేవి, మౌనిక, లక్ష్మి, రాజేశ్వరి, రాణి తదితరులున్నారు.

వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కాకర్ల గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ... 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, జ్వరంతో బాధపడుతున్న ఆరుగురిని గుర్తించామని, వారి నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు చెప్పారు. పలువురు జలుబు, దగ్గు, ఒళ్లనొప్పులతో బాధపడుతున్నట్లు చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం అనూష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటన్న నగర్‌లో...
ఇల్లెందురూరల్: మర్రిగూడెం గ్రామపంచాయతీ కోటన్న నగర్‌లో కొమరవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితులను గుర్తించి వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య ఆశయాలు సాధిద్దాం..


నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: సీపీఐ సీనియర్ నాయకుడు చంద్ర రామయ్య ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. శుక్రవారం జూలూరుపాడులో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో చంద్ర రామయ్య 17వ వర్ధంతి నిర్వహించారు. హేమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై కొత్తూరు గ్రామంలోని రామయ్య స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా జూలూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషాతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పోటు ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీను, చంద్రగిరి శ్రీనివాస్, తోట రామాంజనేయులు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, యాసా రోశయ్య, సామేలు, తూము కోటయ్య, ఎస్కే చాంద్‌పాషా, కొండా వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళీ రథోత్సవం


అమ్మవారి రథోత్సవంలో భక్తులు

కొత్తగూడెంటౌన్: భక్తుల కోలాహలం నడుమ అమ్మవారి రథోత్సవం సందడిగా సాగింది. ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలోని శ్రీశ్రీశ్రీ మహంకాళీ అమ్మవారి బోనాల జాతరను కాళీ ఉపాసకులు ఉప్పల నరేంద్రభవానీ స్వామి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, హోమం పూజలను వేద మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథంపై ఊరేగింపు నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారి నామస్మరణలతో వీధులన్నీ మార్మోగాయి. ఈడ్పుగంటి శ్రీనివాసరావు, రవి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌షాషా, కోనేరు సత్యనారాయణ పలువురు రాజకీయ నాయకులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం


పాల్వంచ: మాట్లాడుతున్న అజిత్

పాల్వంచ: విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థం అవుతోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వి.అజిత్ అన్నారు. శుక్రవారం సీఆర్ భవనలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ విస్మరించారు. ఇప్పటికైన విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండాల సుజన్, రాజు కమల్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధుల కేటాయించిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వానికి విద్యారంగం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కేవలం 7.3 శాతం మాత్రమే కేటాయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనివర్సిటీల అభివృద్ధికి రూ.1000 కోట్లు, పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి ప్రస్తావన లేదన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, విద్యాభివృద్ధి, పేద విద్యార్థులకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామ్‌చరణ్, అనిల్ కుమార్, సాయి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...
సింగరేణి(కొత్తగూడెం): విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు తప్పవని, 7.3 శాతం నిధులతో రాష్ట్ర విద్యారంగ సమస్యలు తీరేదెలాని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వీరభద్రం అన్నారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టాఫీస్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వినయ్, అజయ్, శివ, వేణు, గీతిక, వరూధిని తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సంతాపసభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల మృతి చెందిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ సంతాపసభ ఈనెల 28న ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నామని, ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం రైటర్ బస్తీలో అమరుడు రాయల చంద్రశేఖర్ సంతాపసభ నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాయల 50 ఏళ్ల విప్లవోద్యంలో ప్రజల కోసం ఎంతో త్యాగం చేశారని, ఆయన నమ్మిన సిద్ధాంతం, సోషలిజం కోసం కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, బానోత్ ధర్మ, గుగులోత్ రామచందర్, పెద్దబోయిన సతీష్, మేడుదుల రాజశేఖర్, సంధ్య, పద్మ, దేవీ, కృష్ణ, రాజేశ్వరి, రామకృష్ణ, భగవాన్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహిస్తున్న మాస్‌లైన్ నేత రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం పోచారంతండా గ్రామంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బుర్ర రాఘవులు, లక్ష్మయ్య, కృష్ణ, విజయ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ పూర్తిచేయాలి


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: వనమహోత్సవంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని, ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ ప్రక్రియను పంచాయతీ సిబ్బంది త్వరగా పూర్తిచేయాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన అన్నారు. శుక్రవారం మండలంలోని 3 ఇంక్లైన్ నర్సరీని సందర్శించి ఖాళీగా ఉన్న బ్యాగులల్లో మునగ విత్తనాలు వేసి మొక్కలు పెంచాలని, అలాగే గ్రామపంచాయతీల పరిధిలో ఖాళీ జాగాల్లో విరివిగా మునగ, చింత చెట్లు పెంచాలన్నారు. పెనగడప నర్సరీని సందర్శించి పక్కనే ఒక రైతు ఐదేకరాల్లో జామాయిల్ మొక్కలు వేయడాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ... రైతులు మునగ మొక్కలు నాటి పెంచితే లాభసాటిగా ఉంటుందన్నారు. అదే విధంగా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు ఎకరానికి 900 చొప్పున నాటితే రూ.3 లక్షల ప్రోత్సాహం ఉంటుందని, రెండు సంవత్సరాలు మెయింటెనెన్స్ కింద మొక్కకి రూ.2.50 పైసలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏపీఓ ఈజీఎస్ రఘుపతి, ఈసీ నాగరాజు, టీఏలు యశ్వంత్, అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

శిథిల భవనాల సందర్శన


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: మండలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను శుక్రవారం మన ఊరు - మన బడి జిల్లా కోఆర్డినేటర్ సతీష్ కుమార్, డీఈఓ కార్యాలయ ఐఈడీ కోఆర్డినేటర్ సైదులు సందర్శించారు. జూలూరుపాడు పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాల, మాచేనిపేటతండా, రేగళ్లతండా ప్రాథమిక పాఠశాల భవనాల పరిస్థితిని పరిశీలించారు. మాట్లాడుతూ... పాఠశాలల మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి తరగతులు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఏఈ కె.రామ్‌కుమార్, జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, జూలూరుపాడు పీఎస్ హెచ్ఎం బి.నేతాజీ, ఉపాధ్యాయుడు సీతారాములు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బిల్డింగ్ వర్కర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచెర్ల జమలయ్య, ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవన నిర్మాణం కార్మికులకు చెందాల్సిన సంక్షేమ బోర్డు నిధులు ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. మరణించిన కార్మికుల క్లెయిమ్స్ చెల్లించాలని, నూతన కార్డుకు బయోమెట్రిక్ సిస్టమ్ వలన ఆన్‌లైన్ సమస్యలు వస్తున్నందున పాత విధానంలో కార్డులు తక్షణం అందించాలని కోరారు. ప్రమాదం బీమా రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోగుల కోటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, రాజేష్, కృష్ణ, శ్రీనివాస్, వినోద్, గోవింద్, కుందారావు, చంద్ర మొగిలి, రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా ఆధ్వర్యంలో...
భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో గిరిజనులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ కలెక్టర్ ఎదుట ధర్నా చేశారు. గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్, శ్రీరామ సాయికిరణ్, బట్టు శివ, మాలోత్ ప్రశాంత్ నాయక్ పాల్గొన్నారు.